క్లుప్తంగా

మండల పరిషత్ కార్యాలయం తనిఖీ



డీడీఓ జనార్దనరావును సన్మానిస్తున్న ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది

బత్తలపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని డీడీఓ(డివిజన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) యం.జనార్దనరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను ఆయన ఎంపీడీఓ నరసింహనాయుడును అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం డీడీఓను శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. పరిపాలన అధికారి శ్రీనివాసులు, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

కదిరి అర్బన్: చిగురుమానుతండా, చవిటితండా గ్రామాల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 60 మంది విద్యార్థులకు గురువారం హార్ట్ టు హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు రవినాయక్, ప్రధానోపాధ్యాయులు బాబా, ఉపాధ్యాయులు మౌలా, దేవేందర్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోలీసుల దాడి సరికాదు



శ్రీచైతన్య పాఠశాల ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

కదిరి అర్బన్: ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరుతూ విజయవాడలోని శ్రీచైతన్య కళాశాల వద్ద శాంతియుతంగా ధర్నా చేస్తున్న విద్యార్థి నాయకులపై దాడి చేయించడం సరికాదని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పేర్కొన్నారు. ఘటనకు నిరసనగా స్థానిక శ్రీచైతన్య పాఠశాల వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థలన్నీ టీడీపీ నాయకులవేనన్నారు. ఫీజు దోపిడీని అరికట్టాలని అడిగితే పోలీసులకు దాడి చేయించడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మహేంద్ర, నాయకులు గణేష్, పవన్, ఉమేష్ పాల్గొన్నారు.

ధర్మవరం తహసీల్దార్‌గా సురేష్‌బాబు



ధర్మవరం రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్(ఎఫ్‌ఏసీ)గా సురేష్‌బాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ నటరాజ్ బదిలీపై చిలమత్తూరుకు వెళ్లారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

కొత్తచెరువు విద్యార్థికి విట్‌లో సీటు



నవరత్నం

పుట్టపర్తి: కొత్తచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థికి అమరావతిలోని విట్(ఇంజినీరింగ్ కాలేజీ)లో ఉచితంగా సీటు దక్కింది. ప్రభుత్వ కళాశాలలో అధిక మార్కులు సాధించిన జిల్లాకో విద్యార్థిని విట్ ఉచితంగా చదివించేందుకు ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా తమ కళాశాల విద్యార్థి నవరత్నంకు సీటు దక్కినట్లు ప్రిన్సిపాల్ జ్యోతిర్లత గురువారం తెలిపారు.

ఆముదం విత్తనాల పంపిణీ



రైతుకు ఆముదం విత్తనాలను పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

కదిరి అర్బన్: స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానంలో గురువారం రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో పలువురు రైతులకు ఐసీహెచ్–5 ఆముదం విత్తనాలను పంపిణీ చేశారు. రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా. విజయ్‌శంకర్‌బాబు మాట్లాడుతూ రైతులు వేరుశనగ పంట వేసి తరచూ నష్టపోతున్నారన్నారు. వేరుశనగకు బదులు ఆముదం పంట సాగు చేయాలని కోరారు. ఆముదం పంట సమగ్ర యాజమాన్యాన్ని డా. నసిరుద్దీన్ తెలియజేశారు. మెట్ట ప్రాంతంలో ఈ పంట విశిష్టతను ఏడీఏ సత్యనారాయణ వివరించారు.

పేరు మార్చి.. పనులు విస్మరించి..

- అసంపూర్తిగా విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణాలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- పేదలకు ఆరోగ్యం.. బహుదూరం

పుట్టపర్తి అర్బన్: కూటమి సర్కార్ పేదలకు ఆరోగ్యాన్ని దూరం చేస్తోంది. గత ప్రభుత్వంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల పేరుతో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో భవనాల నిర్మాణం ప్రారంభించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైఎస్సార్ హెల్త్ క్లినిక్ పేరును భారత్ నిర్మాణ్ సేవా కేంద్రాలుగా మార్చేశారు. అయితే పనులు విషయాన్ని పూర్తిగా విస్మరించారు. దీంతో వైద్య సిబ్బందితో పాటు పేదలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్నపాటి వైద్యం కోసం మండల కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. ప్రైవేటు క్లినిక్‌లకు వెళ్లి చిన్న చిన్న జబ్బులకే వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయినా ఇప్పటి వరకూ భవనాల నిర్మాణాన్ని పూర్తి చేయాలనే ఆలోచన లేకపోవడం విశేషం. మంజూరైన భవనాలను పూర్తి చేస్తే గ్రామాల్లోనే వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి పేదలకు వైద్యం అందిస్తారు. భవన నిర్మాణాలను వెంటనే పూర్తి చేసి వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.


పునాదులు దాటని నిర్మాణం..

పుట్టపర్తి మండలంలోని 8 గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు మంజూరయ్యాయి. గత ప్రభుత్వంలో చెర్లోపల్లి, వెంకటగారిపల్లి, బత్తలపల్లి గ్రామాల్లో పూర్తి చేశారు. పెడపల్లి, గంగిరెడ్డిపల్లి, వెంకటగారిపల్లి, కొట్లపల్లి, అమగొండపాళ్యం గ్రామాల్లో పనులు ప్రారంభించారు. గతంలో ఒక్కో భవనానికి రూ.17.5 లక్షలు ఉండగా ప్రస్తుతం రూ.21.80 లక్షలకు పెంచారు. ఈ నిధులు సగం వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించినవి కాగా తక్కినవి ఉపాధి హామీ పథకం కింద వెచ్చించనున్నారు. పుట్టపర్తి మున్సిపాలిటీలో కర్ణాటకనాగేపల్లి రోడ్డు పక్కన శ్మశాన వాటిక సమీపంలో ఏర్పాటు చేయడానికి పిల్లర్స్ ఏర్పాటు చేశారు. సుమారు మూడేళ్ల క్రితం టీడీపీ నాయకులు కోర్టుకు వెళ్లడంతో పనులు నిలిపివేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.



పెడపల్లిలో అసంపూర్తిగా క్లినిక్ భవనం

క్లినిక్ భవనాలను పూర్తి చేయాలి



వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల పేరు మార్చారు కానీ ఇప్పటి వరకూ భవన నిర్మాణాలను పూర్తి చేయక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్న వైద్యానికే మండల కేంద్రాలకు, పట్టణాలకు వెళ్లి వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. వెంటనే భవనాలను పూర్తి చేసి ప్రభుత్వ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలి.

– మాబుసాహెబ్, నిడిమామిడి

సత్యసాయి ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోంది..



పుట్టపర్తిలో ప్రతి చిన్న సమస్యకూ సత్యసాయి ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వ వైద్యం అందనంత దూరంగా ఉంది. గ్రామాల్లో ప్రత్యేక భవన నిర్మాణాలు చేపట్టినా కూటమి నాయకులు అడ్డంకులు తీసుకురావడంతో పూర్తిగా నిలిచిపోయింది. దీంతో ప్రతి చిన్న వైద్యం, మందుల కోసం సత్యసాయి జనరల్, సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోంది.

– శివప్ప, పుట్టపర్తి

నిర్మాణాలు పూర్తి చేస్తాం

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే అర్ధంతరంగా ఆగిన నిర్మాణ పనులను పూర్తి చేయిస్తాం. కేంద్రం నుంచి వచ్చే నిధులు మంజూరవుతున్నాయి. ఇక వైద్యశాఖ నుంచి వచ్చే నిధులు పూర్తి స్థాయిలో వస్తే నిర్మాణ పనులు పూర్తి చేయిస్తాం. కాంట్రాక్టర్లు ముందుకు వస్తే అన్ని పనులూ పూర్తవుతాయి.

– శశికుమార్, పంచాయతీరాజ్ ఏఈ

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలి



తాడిమర్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

బత్తలపల్లి: ఆర్డీటీ సంస్థకు కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్ చేయాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ గత 50 ఏళ్లుగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో బడుగు, బలహీన వర్గాలకు ఎంతో సేవ చేసిందని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్‌ఏను కొనసాగించాలని, లేనిపక్షంలో ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని వారు హెచ్చరించారు. జిల్లా రైతు సంఘం అధ్యక్షులు కమతం కాటమయ్య, ఎస్సీ జనసంఘం నాయకులు రాంప్రసాద్, కుళ్లాయప్ప, దళిత హక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, బహుజన్ సమాజ్ పార్టీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ సాకే వినయ్‌కుమార్, సీబీటీలు వీరనారప్ప తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ మాల్యవంతం గ్రామస్తులు మూడు రోడ్ల కూడలి వద్ద నిరసన తెలియజేశారు.

తాడిమర్రి: ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని ఆర్డీటీ స్వయం సహాయక మహిళా సంఘాల మహిళలు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ఆర్డీటీ స్వయం సహాయక మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఎస్సీ కాలనీలోని ఆర్డీటీ పాఠశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామ ప్రధాన నడిబొడ్డున మానవ హారం ఏర్పాటు చేశారు. అనంతరం వారు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ భాస్కర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. కేంద్ర ప్రభుత్వ చర్యతో ఈ ఏడాది 600 మంది విద్యార్థులు కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ చదివే అవకాశం కోల్పోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని వారు కోరారు. సీబీటీలు రామకృష్ణ, సుదర్శనం, నారాయణస్వామి, ప్రకాష్, సదా, నల్లప్ప, మహిళలు పాల్గొన్నారు.

నల్లమాడ: ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని కోరుతూ గురువారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలు గంగాద్రి, గంగన్నకు వినతి పత్రం అందజేశారు. ఎఫ్‌సీఆర్‌ఏను రద్దు చేయడం వలన సంస్థ ద్వారా ప్రజలకు సేవలు అందని పరిస్థితి నెలకొందన్నారు. వినతిపత్రం అందించిన వారిలో నల్లమాడకు చెందిన పేపర్ రామచంద్ర, ఏఎల్ నరసింహులు, గంగాద్రి, నారాయణస్వామి, వంకరకుంటకు చెందిన సాలమ్మ, శకుంతల, హేమలత, ఆంజనేయులు, మణి, నందిని తదితరులు పాల్గొన్నారు.

కనగానపల్లి: పేదల అభివృద్ధి కోసం పని చేసిన ఆర్డీటీ సంస్థకు అందరూ అండగా నిలుద్దామని దళిత సంఘం నాయకుడు ముక్తాపురం మూర్తి తెలిపారు. మండల కేంద్రం కనగానపల్లిలో గురువారం సేవ్ ఆర్డీటీ పేరుతో దళిత సంఘాల నాయకులు శాంతి ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ మార్కెట్ సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు యువకులు, మహిళలతో కలసి ర్యాలీ చేపట్టారు. సేవ్ ఆర్డీటీ అంటూ నినాదాలు చేస్తూ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అనంతరం దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్ చేసి ఆర్డీటీ సంస్థ కొనసాగేలా చూడాలన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ కలసికట్టుగా పోరాటం చేద్దామన్నారు. అనంతరం ఆర్డీటీ సంస్థ కొనసాగేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలంటూ తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు కనగానపల్లి పెద్దన్న, ప్రభాకర్, గుంతపల్లి అనిత, చంద్రనాయుడు, నాగరాజు, రాజేష్, మహిళలు పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయం: కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి వెంకటేష్ ఆధ్వర్యంలో ఆర్డీటీ సీడీసీ సభ్యులు గురువారంజాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రామాంజనేయులు, సీడీసీ మెంబర్ చిన్న వీరన్న, ప్రభాకర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్‌కు ఘన నివాళి



తాడిమర్రిలో ఫెర్రర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మహిళలు

తాడిమర్రి: స్థానిక ఎస్సీ కాలనీలోని ఆర్డీటీ పాఠశాలలో ఆర్డీటీ సంస్థ మహిళా సంఘాల మహిళలు గురువారం ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఫాదర్ ఫెర్రర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆర్డీటీ పాఠశాలలో సీబీటీ రామకృష్ణ ఆధ్వర్యంలో మహిళలు ఫాదర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. సీబీటీలు సుదర్శనం, నారాయణస్వామి, సత్యవతి, నాగమ్మ, పెద్దక్క, నాగలక్ష్మి పాల్గొన్నారు.

నల్లమాడ: ఆర్డీటీ సంస్థ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ 19వ వర్ధంతిని గురువారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించారు. నల్లమాడలోని బీసీ హాస్టల్ వద్ద ఉన్న ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏటీఎల్ వన్నూరుస్వామి, ఆర్‌డీటీ సిబ్బంది శ్రీనివాసులు, ఆంజనేయులు, నాగరాజు, స్థానిక ఎస్సీ కాలనీవాసులు పేపర్ రామచంద్ర, ఏఎల్ నరసింహులు, గంగాద్రి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు. అలాగే పెమనకుంటపల్లి తండా, కుటాలపల్లి తండా, చెరువువాండ్లపల్లి, దొన్నికోట, గోపేపల్లి, బాసంవారిపల్లి, అరవవాండ్లపల్లి, రెడ్డిపల్లి, రెడ్డికుంట తండా, కొత్తపల్లి తండా, కొండ క్రింద తండా, కుటాలపల్లి, ఎనుమలవారిపల్లి ల్లో ఫాదర్ ఫెర్రర్ వర్ధంతి నిర్వహించారు.

నల్లచెరువు: రాత్నాళ్లపల్లి, నల్లచెరువు, ఉప్పార్లపల్లి, రమమణప్పగారి పల్లి ఎస్సీ కాలనీలలో ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ రఘురాం, ఎస్‌సీ సుకన్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్ వద్ద ఉన్న ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఫెర్రర్ సేవలు చిరస్మరణీయం

కనగానపల్లి: ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ పేద ప్రజల కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. ఆర్డీటీ సంస్థ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ వర్ధంతిని గురువారం మండలంలోని పలు గ్రామాల్లో జరుపుకున్నారు. ముక్తాపురం గ్రామంలో 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పర్వతదేవర పల్లి, కనగానపల్లి, కోనాపురం, శివపురం, మద్దులచెరువు, భానుకోట, మామిళ్లపల్లి, చంద్రశ్చర్ల, తదితర గ్రామాల్లో ఆర్డీటీ సీబీటీ, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఫెర్రర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

మక్బూల్ అహ్మద్‌కు సన్మానం



మక్బూల్ అహ్మద్‌కు స్వీట్ తినిపిస్తున్న లోకేశ్వర్‌రెడ్డి, నాయకులు

కదిరి టౌన్: హజ్ యాత్రను విజయవంతంగా ముగించుకుని వచ్చిన వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్‌ను ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో లీగల్‌సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లింగాల లోకేశ్వర్‌రెడ్డి, పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

బాధితులకు పరామర్శ

గాండ్లపెంట: మల్లమీదపల్లికి చెందిన మాజీ సర్పంచ్ కుమారుడు మనోజ్ కుమార్ ఇటీవల ప్రమాదవశాత్తూ గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ కదిరి సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ గురువారం రాత్రి కోటూరుకు విచ్చేసి మనోజ్‌ను పరామర్శించారు. కదిరి అర్బన్: చవిటితండాలో ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకుని వచ్చిన భీముడునాయక్ అనే కార్యకర్తను గురువారం వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మగ్బూల్ అహ్మద్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండల కన్వీనర్ మణికంఠనాయక్, లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లింగాల లోకేశ్వర్‌రెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, విశ్వనాథ్ ఉన్నారు.

శుభకార్యం



వివాహ వేడుకల్లో పాల్గొన్న మక్బూల్ అహ్మద్

నల్లచెరువు: కె.పూలకుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బషీర్ కుమార్తె వివాహం వి.కొత్తకోట గ్రామంలో గురువారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ యూసుఫ్, మాజీ సర్పంచ్ అక్బర్,నాయకులు హైటెక్ రమణ, రమణారెడ్డి, నాగరాజు, కె.పూలకుంట రమణారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మిపతి, తాజుద్దీన్, నాగరాజు, రహంతుల్లా,కళ్యాణ్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ రైతు సంఘం నూతన మండల కమిటీ ఎన్నిక



సుధాకర్‌రెడ్డి



శంకర్‌రెడ్డి

కదిరి టౌన్: పట్టణంలోని రైతు సంఘం కార్యాలయంలో గురువారం సంఘం నూతన మండల కమిటీ ఎన్నిక జరిగింది. శంకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, జిల్లా ఉపాధ్యక్షుడు శివన్న మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా జూలై 9వ తేదిన జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సంఘం కదిరి మండలం కమిటీ అధ్యక్షుడిగా వి.శంకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఆదినారాయణరెడ్డి, రామసినాయక్, సహాయ కార్యదర్శులుగా ఎం.రెడ్డప్ప, రామ్మోహన్, కోశాధికారిగా శివారెడ్డితో పాటు 8 మంది కమిటి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బాధితుడికి కౌన్సిలర్ల ఆర్థికసాయం



కుమారస్వామికి ఆర్థికసాయం అందిస్తున్న కౌన్సిలర్లు

ధర్మవరం: పట్టణంలోని 22వవార్డు కౌన్సిలర్ చౌడం లక్ష్మిదేవి భర్త చౌడం కుమారస్వామి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న తోటి కౌన్సిలర్లు గురువారం వారి ఇంటికి వెళ్లి ఆర్థికసాయం అందించారు. 24వవార్డు కౌన్సిలర్ గోరకాటి పురుషోత్తం రెడ్డి, 22వవార్డు ఇన్‌చార్జ్ భాస్కర్‌రెడ్డి రూ.20 వేల నగదును కుమారస్వామికి అందించారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కోటిరెడ్డి బాలిరెడ్డి, నాయకులు కత్తె పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

రోగులకు అన్నదానం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గురువారం యువర్స్ ఫౌండేషన్ సహకారంతో స్టేట్ బ్యాంకు ఉద్యోగులు రోగులకు అన్నదానం నిర్వహించారు. ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ నేత తారక్‌నాథ్ వర్ధంతి సందర్భంగా యూనియన్ రీజనల్ కార్యదర్శి రాజశేఖర్, నాయకులు శశిధర్, గోపాల్‌నాయక్, కిశోర్, ఉద్యోగులు పుష్పలత, పూజిత, కృపమ రోగులకు అన్నదానం చేశారు. యువర్స్ ఫౌండేషన్ సభ్యులు వైకే శ్రీనివాసులు, మోహన్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముదిగుబ్బ: మొగలచెట్లపల్లికి చెందిన వరదప్ప(42) అనే వ్యక్తి గురువారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఈ నెల 12న మొగలచెట్లపల్లి నుంచి ముదిగుబ్బకు ద్విచక్ర వాహనంలో వస్తుండగా ఇందుకూరు గ్రామ సమీపంలో అదుపు తప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య మల్లిక ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ..

ధర్మవరం అర్బన్: ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు... పీఆర్‌టీ వీధికి చెందిన గ్రంధి కృష్ణ భార్య మాధవి అలియాస్ జ్యోతి(51)కి రెండున్నరేళ్ల క్రితం రెండు కాళ్లు విరిగి నడవలేని స్థితిలో మంచానికే పరిమితమైంది. రెండు కాళ్లకు ఆపరేషన్లు చేసినా ఫలితం లేకపోయింది. జీవితంపై విరక్తి చెందిన ఆమె బుధవారం సాయంత్రం విష ద్రావకం తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో గురువారం మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కేసు నమోదు

ధర్మవరం అర్బన్: భార్యను వేధిస్తున్న భర్తతోపాటు మరో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. టూటౌన్ సీఐ రెడ్డెప్ప తెలిపిన వివరాలు.. రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాధవికి దుర్గానగర్‌కు చెందిన కుమార్‌తో 12 ఏళ్ల క్రితం జరిగింది. వారికి ఇద్దరు కుమార్తెలున్నారు. కుమార్ 3 నెలల నుంచి అనంతపురానికి చెందిన చంద్రకళతో సన్నిహితంగా ఉంటూ కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాడు. పెద్ద మనుషులతో పంచాయతీ చేసినా అతడి ప్రవర్తనలో మార్పు రాలేదు. చంద్రకళ, ఆమె చెల్లెలు మాధవికి ఫోన్ చేసి భర్తను వదిలేసి పోవాలని లేకుంటే అంతు చూస్తామని బెదిరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కుమార్, చంద్రకళతో పాటు ఆమె చెల్లెలిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ప్రభుత్వాస్పత్రికి పరికరాల అందజేత

ధర్మవరం అర్బన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని కంటి వైద్య విభాగానికి స్పందన ఆసుపత్రి వ్యవస్థాపకులు డాక్టర్ వై సోనియా, టీఎం బషీర్ రూ.40 వేలు విలువ చేసే కంటి వైద్య పరికరాలను అందించారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గురువారం సూపరింటెండెంట్ మాధవికి విజన్ చెకప్ చార్ట్, ట్రయల్ ఆప్టికల్ బాక్స్, డైరెక్ట్ ఆప్తాల్మో స్కోప్, కలర్ విజన్ చార్ట్, నియర్ విజన్ చార్ట్‌లను అందజేశారు. స్పందన ఆసుపత్రి వైద్యులను ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ శాలువాలు, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ వైద్యులు రాముడు, హరిశ్రీనివాస్, నజీర్, వెంకటేశ్వర్లు, ఆసుపత్రి ఏఓ ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

అమడగూరు: తాము 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూముల సర్వే నంబర్లు తప్పుగా వేసి తమను ఇబ్బందులు పెడుతున్నారని లోకోజుపల్లి రైతులు గురువారం తహసీల్దార్ రామనాథరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. లోకోజుపల్లి గ్రామ పొలాల్లో గత 50 ఏళ్లుగా పంటలు సాగు చేసుకుంటున్నామన్నారు. అయితే ఇటీవల రీ సర్వే చేసిన రెవెన్యూ అధికారులు తమ భూముల సర్వే నంబరు 311 కాదని, 190, 192, 193 సర్వేనంబర్లుగా ఉన్నాయని చెబుతున్నారన్నారు. ఒకవేళ సర్వే నంబరు తప్పుగా ఉంటే సరైన నంబర్లు వేసి తమ భూములు తమకు దక్కేలా చూడాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

తనకల్లు: గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించనున్నట్లు ఎంపీడీఓ రామానాయక్ అన్నారు. దేవళంతండాలో గురువారం ధర్తీ ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ధర్తీ ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ కింద దేవళంతండాను ఎంపిక చేశామన్నారు. అందులో భాగంగా ఈ నెల 30వ తేది వరకు తండాలో ఇంటింటికి వెళ్లి పింఛన్, రేషన్, సొంత ఇల్లు తదితర వివరాలను సేకరించనున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్ మునేనాయక్, కార్యదర్శి మజీద్, సర్వేయర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంలపై చర్యలు తీసుకోవాలి

ధర్మవరం: పదో తరగతి పూర్తయిన విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో టీసీలు ఇవ్వడానికి డబ్బు వసూలు చేస్తున్న హెచ్‌ఎంలపై చర్యలు తీసుకోవాలని పీఎస్‌యు విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మొండి నందకిషోర్ కోరారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో అధికారిణి సుజాతకు గురువారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, గుణవరన్, ప్రవీణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

మాజీ పాత్రికేయుడు మృతి

అమడగూరు: అమడగూరుకు చెందిన మాజీ పాత్రికేయుడు రవీంద్ర (40) గురువారం గుండెపోటుకు గురై మృతి చెందాడు. రవీంద్ర దివ్యాంగుడు కావడంతో మూడు చక్రాల సైకిల్ మీద తిరుగుతుండేవాడు. గురువారం అమడగూరులోని చౌడేశ్వరీ ఆలయం వద్ద ఉండగా అకస్మాత్తుగా గుండెపోటుకు గురి కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని కోరారు.

చెక్కభజనను వృత్తి కళగా గుర్తించాలి

తాడిమర్రి: చెక్కభజనను వృత్తి కళగా గుర్తించాలని కళాకారులు నిడిగల్లు సుదర్శనం, తురకవారిపల్లి రాజశేఖర్, ఆత్మకూరు కిష్టప్పలు ప్రభుత్వాన్ని కోరారు. తాడిమర్రిలో గురువారం వారు శ్రీకోదండరామ చెక్కభజన కళాకారుల అభివృద్ధి సంఘం 6వ వార్షికోత్సవ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రమ నుంచి ఆట, పాట, మాట, బాష, నృత్యం, భజనలు పుట్టాయన్నారు. మనిషి శ్రమ నుంచి సేద తీర్చడానికి పంచుకున్న కళల్లో చెక్క భజన ఒకటన్నారు. ఈనెల 22న నార్పల మండల కేంద్రంలో జరగనున్న ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు. కళాకారులు నల్లప్ప, కుళ్లాయప్ప, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వికసిత భారత్‌లో భాగస్వాములు కండి

ముదిగుబ్బ: వికసిత భారత్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అగ్రికల్చర్ రీసెర్చ్ కోకన్వీనర్ సోమల ప్రకాష్ నాయుడు కోరారు. గురువారం ఆయన మండల కేంద్రంలో స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. అ కార్యక్రమంలో నాయకులు పసుపులేటి వెంకటేష్, జనగాని వెంకటేష్, దేశ నారాయణ, గంగులప్ప, చాంద్‌బాషా, షేక్ అనీష్, సాయి చరణ్, నరసింహులు, సరస్వతి, గంగాదేవి, కాశమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



కదిరిలో కేక్ కట్ చేస్తున్న షానవాజ్

కదిరి టౌన్/ కదిరి అర్బన్/నల్లమాడ/ తనకల్లు: కదిరి కాంగ్రెస్ కార్యాలయం, మొటుకుపల్లి ఆర్డీటీ దివ్యాంగుల పాఠశాల, నల్లమాడ, తనకల్లులో గురువారం ఆపార్టీ లోకసభ పక్షనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కెఎస్ షానవాజ్ కేక్ కట్ చేశారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు మోహన్‌గాంధీ దివ్యాంగ విద్యార్థులకు డిటర్జెంట్ పౌడర్, సోప్స్, టవల్స్ పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు మేదర నాగభూషణం, అల్లాబకష్, జైనుల్లా, షబ్బీర్, నాగేంద్ర, సోహేల్, ఇందాదుల్లాఖాన్,ఖుదాబకష్, పఠాన్ గౌస్‌బాషా, శివశంకర్ గౌడ్, గంగాద్రి, అంజనేయులు, అల్లాబకష్ తదితరులు పాల్గొన్నారు.